క్లుప్తంగా

విద్యార్థులకు కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్

సామర్లకోట: మండల పరిధిలోని పనసపాడు గ్రామంలో విద్యార్థులకు బుధవారం సర్పంచ్ చీకట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీవనోపాధి పోగొట్టకండి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

సామర్లకోట: చేతి వృత్తులు చేసుకుని జీవిస్తున్న వారికి మున్సిపల్ అధికారులు ఊతం ఇవ్వాలని ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు సుందరపల్లి వీవీఎస్ గోపాల కృష్ణ అన్నారు. బుధవారం నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు మున్సిపల్ కమిషనర్ జె.రామారావును కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో 30 ఏళ్లుగా వెదురుపాక సత్యనారాయణ క్షౌ రశాల నిర్వహిస్తున్నారని, అయితే ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు దానిని తొలగించాలని మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారని వివరించారు. వ్యక్తిగత కక్షతో ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి బాధితునికి న్యాయం చేయాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: మండల పరిధిలో పలు గ్రామాలకు గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవీ పవర్‌ఫీడర్ మరమ్మతుల వల్ల ఉండూరు, గొంచాల, నవర, పవర, పి.వేమవరం, కాపవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

సమస్యలపై చైర్‌పర్సన్‌ను నిలదీసిన కౌన్సిలర్లు



సమావేశంలో బైఠాయించిన కౌన్సిలర్

పిఠాపురం: గొల్లప్రోలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన సధారణ సమావేశం జరిగింది. మున్సిపాలిటీలో ఉన్న పలు సమస్యలపై చైర్‌పర్సన్‌ను కౌన్సిలర్లు నిలదీశారు. తాగునీటి సరఫరా కోసం రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ప్రజలకు మాత్రం కుళాయిల ద్వారా మురుగు నీరే అందుతోందని 12వార్డు కౌన్సిలర్ గుళ్ళ సుబ్బారావు ఎద్దేవా చేశారు. ఎన్నికల అడ్వాన్సులపై గత సమావేశంలో రూ.33వేలు బిల్లులు చూపించారు. మళ్లీ అదే లక్షను కౌన్సిలర్ ఆమోదానికి ఎలా పెడతారన్నారు. సమస్యలు తక్షణమే పరిష్కారం చూపాలని సభలో బైఠాయించారు. విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ లైన్ పనులు జరుగుతున్నాయని నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఏ విద్యుత్ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

8న ఎస్‌ఎంసీ ఎన్నికలు

సామర్లకోట: ఈనెల 8వ తేదిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి విద్యాశాఖాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని ఎంఈఓ వై శివరామకృష్ణయ్య తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతిని ఒక యూనిట్‌గా తీసుకోనున్నట్టు తెలిపారు. ప్రతి యూనిట్‌కు ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పూర్తి బాధ్యత తీసుకోవాలని చెప్పారు.

ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం

కాకినాడ క్రైం: కాకినాడలోని ఆనంద భారతి మైదానంలో ఓ ఎలక్ట్రికల్ బైక్ బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైంది. నగరానికి చెందిన వాసంశెట్టి సంతోష్ అనే వ్యక్తి భానుగుడి నుంచి కల్పన సెంటర్ వైపు బుధవారం టీవీఎస్ కంపెనీకి చెందిన తన ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ఈ క్రమంలో వాహనం ఆనంద భారతి గ్రౌండ్ వద్దకు వచ్చే సరికి వాహనం లోపలి నుంచి పొగలు రావడం ప్రారంభమైంది. దీంతో కంగారు పడ్డ సంతోష్ తనతో పాటు మరెవరికీ ఏ హాని జరగకూడదనే ఉద్దేశంలో ఆనంద భారతి గ్రౌండ్‌లోకి తీసుకు వెళ్లి తన వాహనాన్ని ఆపి ఇంజన్ ఆఫ్ చేశాడు. మంటలు అంతకంతకూ పెరిగి వాహనం పూర్తిగా కాలి దగ్ధమైంది. అక్కడికి చేరుకున్న డీఎఫ్‌వో సుబ్బారావు ఆధ్వర్యంలోని సాలిపేట ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. రూ.1.2 లక్షల ఆస్తి నష్టంగా నిర్ధారించారు.

ఏ ప్రాణానికి ఏ పాశమో!

- ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో పేదల ఇళ్ల నిర్మాణాలు
- వాటి మీదుగా విద్యుత్ తీగలు
- ప్రమాదాల పాలవుతున్న గృహస్తులు
- తీగలను తప్పించమంటే షిఫ్టింగ్ చార్జీ చెల్లించాలని హుకుం
- స్థలాలు ఇస్తాం కానీ షిఫ్టింగ్ చార్జీలు తమ వల్ల కాదంటున్న అధికారులు

సామర్లకోట: విద్యుత్ శాఖ అనాలోచిత చర్యలకు వినియోగదారులు పలు సందర్భాల్లో ప్రాణాలను మూల్యంగా చెల్లించుకోవలసి వస్తోంది. ఇల్లు నిర్మించుకున్న ప్రతి వారికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం ఆ శాఖ బాధ్యత. అదే సమయంలో వినియోగదారులకు తగిన భద్రతను కల్పించాల్సిన బాధ్యత ఆ శాఖపై ఉంది. ప్రమాదకరమైన విద్యుత్ తీగలు ఇంటికి దూరంగా ఉండేలా స్తంభాల ఏర్పాటు, విద్యుత్ తీగలకు రక్షణగా గొట్టాలు తొడగడమో లేదా విద్యుదాఘాతం తగలని విధంగా ఇన్సులేషన్ చేయడమో ఆశాఖ విధి. ఇళ్లలో మహిళలు బట్టలు ఆరేసే సమయంలోనో, సదరు భవనానికి మరమ్మతులో, లేదా అభివృద్ధి పనులు చేసే సమయంలోనో విద్యుత్ తీగలు తగిలి కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడమో లేదా తీవ్ర విద్యుత్ సంబంధ గాయాలతోనో బయటపడుతున్నారు. ఆటువంటి ప్రమాదాలు సంభవించకుండా ఆ శాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

స్థానిక బ్రౌన్‌పేట సమీపంలోని గణేష్‌కాలనీలో అనేక మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో వారు ఇళ్లు నిర్మించుకున్నారు. సమీపంలోనే విద్యుత్ సబ్ స్టేషన్ ఉండడంతో 11 కేవీ విద్యుత్తు తీగలు ఆ ప్రాంతం నుంచి పట్టణం, ఇతర ప్రాంతాలకు వెళ్తాయి. అలాగే పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో కొండయ్యపేటలోనూ విద్యుత్ లైన్లు ఉన్నాయి.

పేదలపైనే పెనుభారం..

గణేష్ కాలనీలో ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు జరుగుతున్న ప్రమాదాలపై వినియోగదారులు సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్ల ముందు ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, వాటికి ఉన్న తీగలతో తమకు ప్రాణాపాయం పొంచి ఉందని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇళ్లు లేని సమయంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్లను ప్రస్తుతం మార్చడం సాధ్యం కాదని ట్రాన్స్‌కో అధికారులు చెప్తున్నారు. వాటిని మార్చాలంటే షిఫ్టింగ్ చార్జిలు చెల్లించాల్సిందేనని అంటున్నారు. దళిత, పేద కుటుంబాలకు చెందిన తమకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటే షిఫ్టింగ్ చార్జీలు ఎక్కడ చెల్లించగలమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఓ పెద్ద ఆక్రమణదారు ఓ స్థలాన్ని కబ్జా చేసి విద్యుత్ లైన్లు అడ్డుగా ఉన్నాయి తీసేయమంటే మారు మాట లేకుండా ఏదో సర్దుబాట్లు చేసుకుని పక్కకు తప్పిస్తారు కానీ పేదల విషయానికి వచ్చేటప్పటికి ఇలా బెదిరిస్తున్నారని వారు వాపోతున్నారు. కాగా తమకు అందరూ సమానమేనని, లైన్ల మార్పు కోసం దరఖాస్తు చేస్తే పరిశీలించి అంచనాలు ప్రభుత్వానికి పంపిస్తామని, అప్పుడు షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని వివరిస్తున్నారు.



సామర్లకోట గణేష్‌కాలనీలో ఇళ్ల మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు



పెద్దాపురం పాండవుల మెట్ట వద్ద ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్తు వైర్లు



సామర్లకోట గణేష్‌కాలనీలోనే మరో ప్రదేశంలో..

పోరాటం చేస్తే నన్నే కట్టమన్నారు...



గణేష్ కాలనీలో అనేక మంది పేదలకు సుమారు 30 ఏళ్ల క్రితం ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో ప్రారంభంలో పాకలు వేసుకున్నారు. క్రమేపీ ప్రభుత్వ ఆర్థిక సమయంతో కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. స్లాబ్‌లు వేసుకున్న వారి ఇళ్ల మీదుగా విద్యుత్తు లైన్లు వెళ్లడంతో సుమారు 8 ఏళ్ల క్రితం ట్రాన్స్‌కో అధికారులకు లైన్ల మార్పు కోసం ఫిర్యాదు చేశాము. దాంతో విశాఖపట్నంలోని ట్రాన్స్‌కో సీఎండీ రూ.ఆరు లక్షలు చెల్లించాలని తనకు నోటీసు ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాలి. అక్కడి పేదలు చెల్లించే స్థితిలో లేరు.

– నూతలపాటి అప్పలకొండ, బ్రౌన్‌పేట, సామర్లకోట

షిఫ్టింగ్ చార్జీలు చెల్లించవలసిందే



విద్యుత్తు లైన్ల మార్పుకు సంబంధించి షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాలి. వ్యక్తిగతంగా చెల్లించక పోతే మున్సిపాలిటీ నుంచి అయినా చెల్లించేలా చూడాలి. విద్యుత్తు వైర్లు ఎప్పుడో ఏర్పాటు చేశారు. విద్యుత్తు వైర్ల కింద నుంచి ఇళ్ల నిర్మాణాలు చేయకుడదు. గతంలో ఏం జరిగిందో తెలియదు. ప్రస్తుతం విద్యుత్తు లైన్ల దిగువ భాగంలో ఉన్న ఇళ్ల యాజమానులకు నోటీసులు ఇస్తాం.

– ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్, ఏపీ ఈపీ డీసీఎల్ ఇఇ, సామర్లకోట

నిర్మాణాలకు ముందే గమనించాలి

పేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే సమయంలోనే విద్యుత్ లైన్లను గమనించాలని మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ వైర్ల నుంచి ప్రమాదం లేకుండా పైపులు ఏర్పాటు చేసుకోవాలని. ఇళ్ల మీదుగా వెళ్లిన విద్యుతు లైన్లకు సంబంధించిన సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని మున్సిపల్ కమిషనర్ రామారావు తెలిపారు.

సిలబస్ సకాలంలో పూర్తిచేయాలి



వేట్లపాలెం పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలను తెలుసుకుంటున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్దేశించిన సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య పిలుపు నిచ్చారు. బుధవారం మండల పరిధిలో వేట్లపాలెం ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రవేశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లు నిండిన పిల్లలను నేరుగా ఒకటవ తరగతిలో చేర్చేలా తల్లిదండ్రులల్లో అవగాహన పెంచాలన్నారు. విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాలు, రాత నైపుణ్యాలను ప్రతి తరగతికి వెళ్లి పరిశీలించారు. విద్యార్థుల బ్యాగ్‌లలో వారు పుస్తకాలు పెట్టుకునే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే పాఠశాలలో వసతులను ఆయన పరిశీలించారు.

పింఛన్ల పంపిణీకి 115 మంది సిబ్బంది

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 6,435 మందికి పింఛన్లు పంపిణీ చేయడానికి 115 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఈ మేరకు బ్యాంకు నుంచి రూ.రెండు కోట్లు, 73 లక్షల, 37 వేలు సిబ్బందికి అందజేసినట్టు తెలిపారు. పింఛను లబ్ధిదారులు ఇళ్ల వద్ద ఉండి మొదటి రోజునే 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యేలా సహకరించాలన్నారు.

600 మందికి కళ్లజోళ్ల పంపిణీ



ఉచిత కళ్లజోళ్లు అందిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

కొత్తపల్లి: స్థాని సురక్షా పేలస్‌లో బుధవారం సురక్షా మల్టీ స్పెషాలిటీ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళ్లజోళ్లను పంపిణీ చేశారు. గత నెల 14న ఇక్కడ కిరణ్ కంటి ఆసుపత్రి నిర్వహణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి పరీక్షలు అనంతరం అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు.

డెంగీ, డయేరియాలపై అవగాహన

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వైద్యులు, వైద్య విద్యార్థులు ప్రజాక్షేత్రంలో మమేకమయ్యారు. మంగళ, బుధవారాలలో కాకినాడ, రామేశ్వరంలో విస్తృతంగా పర్యటించారు. ప్రస్తుతం జిల్లాను పట్టి పీడిస్తున్న తీవ్ర జ్వరాలు, డెంగీ, డయేరియాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అతిసారం సంభవించే తీరు, తీసుకోవలసిన జాగ్రత్తలు, చేతి శుభ్రత, ఓఆర్‌ఎస్ ద్రావణ తయారీని వివరించారు. ఫ్రైడే డ్రైడే ప్రాధాన్యం, వ్యక్తిగత పరిశుభ్రత వల్ల కలిగే లబ్ధిని తెలియజేస్తూ లఘు నాటికను ప్రదర్శించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ బి.దేవీమాధవి, డాక్టర్ ఎల్.సౌమ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రుక్మిణీదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

- కౌన్సిల్ అంటే అంత చులకనా?
- ఆదాయ వనరులపై దృష్టి లేదు
- అధికారుల తీరుపై పెద్దాపురం, సామర్లకోట కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం



పెద్దాపురం కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ వీర్రాఘవులు

పెద్దాపురం: కౌన్సిల్ అంటే అధికార యంత్రగానికి చులకనగా ఉందా, గత సమావేశాల్లో ఆదాయ వనరులపై దృష్టి సారించాలి, పారిశుధ్య పనులు మెరుగుపరచాలని చెప్పినా ఎక్కడికక్కడే పనులు నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ అధికార యంత్రాంగంపై మండిపడింది. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరెళ్ళి వీర్రాఘవులు, త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించినా అధికారులు పట్టించుకోకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం మారిందన్న నెపంతో అధికారులు కింది స్థాయి సిబ్బందిని ఉద్యోగం నుంచి తీయించేస్తామని బెదిరించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సమయంలో సుమారు 1.86 లక్షలతో కొనుగోలు చేసిన సెంట్రల్ లైటింగ్ పరికరాలు ఎక్కడ వినియోగించారని ఇంజినీరింగ్ అధికారులను నిలదీశారు. కేవలం 30 వేల రూపాయలు విద్యుత్ పరికరాలు వినియోగించి మిగిలిన సొమ్ముకు సంబంధించిన సామాగ్రిపై ఓ పత్రికలో కథనం వచ్చే వరకు అధికారులు గోప్యంగా ఉంచారని మండిపడ్డారు. వీధిలైట్లు లేని చోట ఎందుకు సెంట్రల్ లైటింగ్ వినియోగించడం లేదని ధ్వజమెత్తారు. 23వ వార్డు కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు మొదలు కాకపోవడంపై ప్రశ్నించారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఆరు నెలలకు పైగా టీపీఓ, టీపీఎస్‌లు లేక ఆ విభాగంపై సరైన అవగాహన లేక పట్టణంలో వచ్చే ఆదాయ వనరులు కంటుపడుతున్నాయన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, కమిషనర్ పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, డీఈ ఆదినారాయణ, ఆర్ఓ చంద్రశేఖరం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్లు ఆకుల కృష్ణబాపూజీ, పేరింశెట్టి అంబిక తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ నేతల హరిబాబు

సామర్లకోట: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో రోగాలు వ్యాప్తి చెందేలా పట్టణ పారిశుధ్యం అధ్వానంగా ఉందని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. మున్సిపల్ ఆదాయ వనరులపై శ్రద్ధ చూపాలని వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ అధికారులకు సూచించారు. పారిశుధ్యంపై కౌన్సిలర్లు నేతల హరిబాబు, పితాని కృష్ణ, పిట్టా సత్యనారాయణ, కాళ్ల శ్యామల తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ బదులిస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయంలోని ఇద్దరు శానిటరీ సెక్రటరీలకు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు అప్పగించినట్టు వివరించారు. నిత్యం తాను పలు వార్డుల్లో పర్యటిస్తున్నానని, సిబ్బందికి అవసరమైన అన్ని పరికరాలు అందజేస్తామని ఆయన తెలిపారు. స్థానిక తాగునీటి చెరువులో చేపల వేట వద్దని కలెక్టర్ ఆదేశించినా సరైన అదే కొనసాగించడం, చెరువు గేటు తాళాలు బయట వ్యక్తుల వద్ద ఉండడమేంటని నేతల హరిబాబు ప్రశ్నించారు. తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని, తోటకూర సాయిరామకృష్ణను ఈ పాఠశాలకు బదిలీ చేసి బోధన మెరుగుపరచాలని ప్రశ్నించగా పాఠశాలలపై తనకు అజమాయిషీ లేదని కమిషనర్ తెలిపారు. పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగిపోయి పాములు వస్తున్నాయని కౌన్సిలర్లు తెలపగా, ఆయా స్థలాల యజమానులకు నోటీసులు ఇప్పిస్తామని కమిషనర్ తెలిపారు. అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల మృతి చెందిన మాజీ కౌన్సిలర్ గోపు దుర్గాభవానికి సభ్యులు సంతాపం తెలిపారు.

విద్యార్థి భవితకు బాటలు వేసేది ఉపాధ్యాయులే..

- విశ్రాంత ఉపాధ్యాయునికి ఘనంగా సత్కారం



విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది వారి ఉన్నతికి, భవితకు బాటలు వేసే దిశగా శిక్షణ ఇచ్చేది ఉపాధ్యాయుడేనని వైఎస్సార్ సీపీ నాయకుడు, సైకాలజిస్టు వడిశెట్టి నారాయణరెడ్డి అన్నారు. ములపేట జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన యరకం వెంకటరెడ్డిని బుధవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కంబాల మౌనిక, వడిశెట్టి గౌరిరాజేశ్వరి, ఎంపీటీసీ అడ్డా పాప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పనిచేయాలి



పారిశుధ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ భావన

- పారిశుధ్య కార్మికులకు కమిషనర్ భావన పిలుపు
- పలు ప్రాంతాల్లో పనుల పరిశీలన

కాకినాడ: ప్రజల భాగస్వామ్యంతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన పారిశుధ్య కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం టిడ్కో గృహ సముదాయంలోని పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. 3, 4 సర్కిళ్ల పరిధిలోని డైరీ ఫారం సెంటర్, అయోధ్య నగర్ ప్రాంతాల్లోని మస్టర్ కేంద్రాలను కూడా ఆమె సందర్శించారు. అక్కడి పారిశుధ్య కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజల భాగస్వామ్యంతో సమిష్టిగా పని చేయాలని సూచించారు. కార్మికులకు ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజలు సహకరించి తడి–పొడి చెత్తను వేరువేరుగా ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు మాత్రమే అందజేయాలని సూచించారు. మస్టరు కేంద్రాల వద్ద రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బంది హాజరవుతున్న సమయాన్ని ఆరా తీశారు. అలాగే వివిధ దశల్లో ఉన్న అన్న క్యాంటీన్ల అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, ఏఈలు వై.నాగేశ్వరరావు రమేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కనీస ధరతో సన్నబియ్యం ఇవ్వండి

- సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజా పంపిణీ వ్యవస్థపై సమీక్ష



ప్రజా పంపిణీ వ్యవస్థపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: నాణ్యమైన సన్న బియ్యం కనీస ధర నిర్ణయించి విక్రయిస్తే ప్రజలు వంద శాతం వినియోగించుకునే అవకాశం ఉందని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు, అంగన్‌వాడీ సెంటర్లకు, సంక్షేమశాఖ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకాలకు పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతపై కలెక్టర్ షాన్ మోహన్ బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఫోర్టిఫైడ్ బియ్యం బాగానే ఉన్నాయని, మరిన్ని రకాల సన్నబియ్యాన్ని కనీస ధరకు అందజేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు తీరు, సరుకుల నాణ్యత తదితరాలపై కార్డుదారులు, లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు సర్వే నిర్వహించి నివేదికను అందజేయాలని పౌర సరఫరాల ఉప తాహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్ట అమలుకు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి పాటించాల్సిన విధి విధానాలను చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, పౌర సరఫరాల సంస్థ అధికారులు, విద్యాశాఖ, తూనికలు కొలతలు, వ్యవసాయ మార్కెటింగ్, సాంఘిక సంక్షేమ, గిరిజన, మహిళా శిశు సంక్షేమం, వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారులు, వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రేషన్‌షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల ప్రతినిధులు, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన చికిత్స

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓ రోగికి అరుదైన వైద్యం చేసి ప్రాణాలు నిలిపారు. అంతర్వేది మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ కొద్ది రోజుల క్రితం జ్వరం, ఫిట్స్‌తో రాజమహేంద్రవరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. అక్కడి వైద్యుల ప్రయత్నం ఫలించకపోవడంతో ఆమె జీజీహెచ్‌లో చేరారు. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో న్యూరో సర్జరీ ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ ఎస్‌ఎం షరీఫ్, డాక్టర్ రవితేజ ఆమెకు పోస్ట్ వైరల్ 'సూపర్ రిఫ్రాక్టరీ స్టేటస్ ఎపిలెప్టికస్' అనే వ్యాధిగా నిర్ధారించి ఖరీదైన ఐవీ, ఐజీలతో వైద్యం అందించారు. ఆరోగ్య శ్రీ ఉండడంతో ఆమెకు నిరాటంకంగా వైద్యం అంది ప్రాణాపాయం నుంచి బయటపడింది.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



పొన్నాడలో స్థలం ఆక్రమించి బడ్డీకొట్టు ఏర్పాటు చేసిన దృశ్యం

కొత్తపల్లి: ప్రభుత్వ స్థలాలు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయి. మండలంలోని పొన్నాడ పంచాయతీ పరిధిలో జగనన్న లే అవుట్‌లో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి లెవెల్ చేసి ఓ వ్యక్తి బడ్డీకొట్టు ఏర్పాటు చేశాడు. ఆ స్థలంలో తాగునీటి ఓవర్ హెడ్ నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. స్థలాలను ఆక్రమణకు గురి చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సత్తిబాబుని వివరణ కోరగా అమరవిల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బడ్డీకొట్టు పెట్టాడని, దీనిపై సర్వే చేసి ప్రభుత్వ స్థలం అయితే వెంటనే చర్యలు తీసుకొని తొలగిస్తామన్నారు.